# ఎంతెంత దూరం...

## సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

**ఊరికి ఇవతల బడి ముందరే బస్సాగింది.**

**అన్నం క్యారియర్, న్యూస్ పేపర్, టవల్ లాంటి వస్తువులున్న చేతిసంచితో బస్సు దిగాడు టీచర్ రమణ.**

**బస్సు కదలి వెళ్ళగానే తలెత్తి ఓసారి బడి కేసి చూశాడు. బడి ముందు పదిమందికి పైగా పిల్లలున్నారు.**

**గోలగోలగా ఆడుకొంటున్నారు. ఒక్కడు కూడా ఇటుకేసి రాలేదు. తన కు నమస్కారాలు చెబుతూ క్యారియర్ సంచిని అందుకొని వెళ్ళ లేదు.**

రోజూ తను ఒత్తిడి చేస్తూనే ఉన్నా వాళ్ల కింకా సరైన క్రమశిక్షణ అలవడ లేదు. వాళ్లపట్ల అసహనపడుతూనే ముందుకు్కదిలాడు.

పిల్లలంతా ఎవరి లోకంలో వాళ్లున్నారు.

ఎవరికి తోచిన ఆటలు వాళ్లు ఆడుకొంటున్నారు. ఇద్దరు పిల్లలు పరస్పరం వీపుల్ని ఆన్చి, చేతుల్ని చంకల్లో మెలేసుకొని... వాళ్లల్లో ఓ కుర్రాడు ముందుకు వంగటంతో రెండవవాడు వాడి వీపుమీద వెల్లకిలా పరున్నట్లయింది. మొదటివాడు రెండవవాడిని మోసుకుపోతున్నాడు.



"ఎంతెంత దూరం...?" పైనున్న వాడు రాగం తీశాడు.

"శానా శానా దూరం..." మోసేవాడు శృతి గలిపాడు.

"కుక్కలు నక్కలుండాయేమో జాగర్త..."పైవాడుచెబుతున్నాడు.

అలా కొంత దూరం మోసిన తర్వాత మోసేవాడు నిటారుగా అయి, వోయించు కున్నవాడు వంగటంతో పరస్పరం విధులు మారాయి.

పదం రూపంలోని ఆ సంభాషణని పదే పదే పాడుతూ బరువును మార్చుకొంటూ వున్నపిల్లలు టీచర్‌రాకను కూడా గమనించలేదు.

రమణకు అసహనం పెరిగిపోయింది. ఇంతదాకా సీటు దొరకని పల్లెబస్సు లోప్రయాణం.

ఇప్పుడేమో క్రమశిక్షణలేని పిల్లలమధ్య గమనం.

"రేయ్ లోపలికి పోండి..." గద్దించాడు.

ఒక్కసారిగా పిల్లల్లో చలనం వచ్చింది.

కంకుల మీద వాలి తన్మయత్వంతో గింజలు కొరుకుతూ వున్న పక్షులు కాపువాని కేకకు ఉలికి పడుతూ గమ్యం తెలీకుండా గాల్లోకి ఎగిరినట్లుగా పిల్లలంతా తేరుకొని బడిలోకి పరుగెత్తారు. ఈ కొద్దిపాటి అదుపు కోసం నెలరోజులుగా తను అవస్థ పడుతున్నాడు.

మెల్లిగా బడిలోకెళ్లి, కుర్చీలో కూచుని, రిజిస్టర్‌లో సంతకం చేసింతర్వాత, పిల్లలకు హాజరు వేద్దామని మళ్లీ విరమించు కొన్నాడు.

పేర్లు మాత్రం అరవైకి పైగా వున్నాయి. హాజరయ్యేది ఏనాడూ ముప్పైకి మించలేదు. కొందరు ప్రైవేటు స్కూళ్లకు...ఇంకొందరు పొలాలపైకి.

పిల్లల్ని బడిలోకి రప్పించలేకపోవటం తన చేతగానితనంగానే అభిప్రాయపడుతున్నాడు మండల విద్యాశాఖాధికారి.

పిల్లల హాజరు శాతం పడిపోవటమనేది ఇప్పుడు కొత్తగా జరిగిన విషయమేమీ కాదు. సంవత్సరం నుంచీ స్కూలు పరిస్థితి అధ్వాన్నంగానే ఉన్న సంగతి అందరికీ తెలుసు. ఓ ఉపాధ్యాయుడు ఏడాది క్రితం ఎమ్మార్పీగా డెప్యుటేషన్ కావటం, మరో ఉపాధ్యాయుడు తరచూ సెలవులు పెడుతూ నెలకిందట రిటైర్డ్ కావటం విద్యార్థుల హాజరు తగ్గటానికి కారణమైంది. డిప్యుటేషన్ మీద వచ్చిన తను నెలరోజుల్లో ఏం వృద్ధి సాధించగలడు?

తమ పిల్లల్ని చదివించాలనే పట్టుదల వున్న తల్లిదండ్రులు దగ్గర్లోని ప్రైవేటు స్కూల్‌ని ఆశ్రయిస్తే, ఇంకొందరు పిల్లలు పొలాల్లోకి పయనమయ్యారు. ఇట్లాంటి పరిస్థితుల్లో పిల్లలు బడికి రాకపోవటం తన తప్పు ఎలా అవుతుందో అర్థం కాలేదు రమణకు.

అధికారి కాబట్టి నేరాన్ని తనమీదే వేయగలిగాడు. తమ పిల్లలు బడికి పోతున్నారో లేదో, టీచర్ ప్రతిరోజూ బడికి వస్తున్నాడో, రావట్లేదో కూడా తెలుసుకోకుండా మూర్ఖంగా వాదించే గ్రామస్తుల్నే వెనకొస్తుకొచ్చాడు ఆయన. నిన్నటి సంఘటన గుర్తుకొచ్చి మనస్సు వికలమైంది రమణకు.

పిల్లలకు రాయిస్తోన్నా, పలికిస్తోన్నా, దిద్దిస్తోన్నా మదిలో ఓవైపు కెలుకుతూనే ఉంది.

తను గ్రామ సర్పంచ్‌ని కలవాలిట. పరిచయం చేసుకోవాలిట.

నెల రోజులుగా తనీ బడికి వస్తోన్నా యింకా గ్రామ సర్పంచ్‌ని కలవకపోవటం నేరంతో సమానమేనట.

అధికారి కాబట్టి ఏమైనా మాట్లాడగలడు.

తనమీద అంత లావు అభాండాలు వేసిన సర్పంచ్‌ని కలిసేందుకు ససేమిరా సమ్మతించటం లేదు మనస్సు.

గ్రామంలోకి వెళ్లాలంటేనే ఇష్టపడటం లేదు.

ఊరికి దూరంగా, తేపతేపకు పిల్లల్ని పరామర్శించేందుకు బడిలోకొచ్చే తల్లిదండ్రులకు దూరంగా, జనగళాల శబ్ద కాలుష్యానికి దూరంగా, పొలాల మధ్య విసిరేసినట్టున్న ఈబడి వాతావరణం తనకెంతో నచ్చింది.

**కథ**

బడి విషయంలో గ్రామస్తుల జోక్యం ఆవగింజంతయినా లేని ఈ స్కూలుకే రేపు కౌన్సెలింగ్‌లో తను ట్రాన్స్ ఫర్ కావాలని కూడా నిన్నటిదాకా భావించాడు. ఇప్పుడా ఆలోచన మనసులోంచి క్రమేణా తొలగిపోతూ వుంది. దానికి కారణం గ్రామ సర్పంచ్, గ్రామస్తులు.

నిన్న జరిగిన జన్మభూమి కార్యక్రమంలో అధికారుల్ని నిలదీశాడుట సర్పంచ్ "టీచర్లు లేక తమ స్కూలు మూత బడిందనీ, వెంటనే చొరవ దీసు కొని ఎవర్నయినా ఉపాధ్యాయుణ్ణి డిప్యుటేషన్ చేయమనీ".

టీచర్ని డిప్యుటేషన్ చేసి నెలరోజులైందనీ, అతను రెగ్యులర్‌గా వస్తున్నాడనీ ఎంఇవో ఎంత చెప్పినా సర్పంచ్ వినకుండా, తమ స్కూల్‌కు టీచరే రాలేదని వాదిస్తాడుట. చివరకు తనను పిలిపించి విద్యార్థులచేత ఐడెంటిఫై చేయిస్తే గానీ మొహం తుమతుమ లాడిస్తూ తలూపలేదు.

"నెలరోజుల్నించి నువ్వు బడికొస్తాండే... మరి పిల్లోల్లంతా యిండ్ల కాండ ఎందుకుండారు సారూ? ఎంతమంది పేర్లుండాయి? ఎంతమంది బడి కొస్తాందరని సూసుకొని వూర్లోకొచ్చేది లేదా?" అంటూ దబాయించాడు.

"ఏమొరే! మీకన్నాతెల్దాఅయ్యోరొచ్చింది"? గ్రామస్తుల్నిఅడిగాడు. వాళ్లల్లో కొందరి సమాధానం తెలీదని.

తర్వాత ఎంఇవో స్కూల్లో కొచ్చి తన్ను మెత్తగా మందలించాడు. నెలరోజుల్నుంచి రెగ్యులర్‌గా బడికొస్తోన్నా ఆ విషయం గ్రామస్తులకు తెలీకపోవటం తన తప్పేనన్నాడు.

వెంటనే సర్పంచ్‌ని అతని యింటివద్ద కలవమని సూచించాడు.



అతని ఇగోని తృప్తిపరచమని చెప్పాడు. ఆ సూచన తనకిష్టంగాలేదు గానీ, తప్పేట్టు లేదు.

సర్పంచ్ ఇంటివద్దకెళ్లాలిట, కలవాలిట, మాట్లాడాలిట. ఊహిస్తేనే ఒళ్లంతా అసహనంతో నిండిపోతూవుంది. తన డ్యూటీకి తను అంకితమై పోగలడు. ఒక్క నిమిషం సమయం కూడా వృధా చేయకుండా పిల్లలకు బోధించగలడు. కానీ యిలాంటి వ్యవహారాలంటేనే మానసికంగా ఎంతో దూరం. చదువు అంటే ఏమిటో తెలీని మొరటు మనిషి ముందు, చదువులు నేర్పే తాము తలొంచటం విద్యావ్యవస్థకే సిగ్గు చేటు.

ఎంయీవో అంతదూరం ఆలోచించినట్టులేదు. ఉపాధ్యాయులపట్ల ప్రజలకున్న గౌరవాన్ని దూరంచేసే దిశగా ద్వారాలు తెరుస్తున్నాడు. అలాగని ఆయన ఆజ్ఞను తను జవదాటేందుకు లేదు. తనీరోజు అతన్ని కలవకుంటే ఏదో ఒక నెపంతో మళ్లీ రిపోర్ట్ చేయగలడు ప్రెసిడెంటు.

నెమ్మదిగా కుర్చీలోంచి లేచాడు రమణ.

బడిపెద్దగా ఓ పిల్లాణ్ని నియమించి ప్రహరీ గేటు దాటబోతూ వుంటే భుజాన పెద్ద దోటీతో మేకల కాపరి ఏవో రాగాలు తీస్తూ బడిలోకి తొంగి చూస్తున్నాడు.

అతనికేసి ఓసారి చూసి ముందుక్కదిలాడు.

బడికి అర్ధకిలోమీటరు దూరంలో ఎత్తుగా పెరిగిన పురాతన చింతచెట్ల మధ్య అస్పష్టంగా కన్పిస్తోన్న బోదకొట్టాలతో వూరు.

ఊరికి బడికి మధ్య మట్టిబాటకు ఇరువైపులా పచ్చటి పొలాలు. పొలాల్లో అక్కడక్కడా కదలాడే రైతులూ. ఒకరూ అరా రోడ్డు వెంట నడుస్తూ ఎదురై అతనికేసి కొత్తగా చూస్తున్నారు. పొలాలమధ్య, పక్షుల అరుపుల మధ్య నడుస్తోంటే వూరు ఏమంత దూరంగా అన్పించలేదు అతనికి.

రాజకీయ నాయకుల ప్రవృత్తే అలా వుంటుందనీ, ప్రభుత్వ ఉద్యోగులం తామే సర్దుకుపోవాలనీ, మరోసారి సర్పంచ్‌ని కలిసేందుకు ప్రయత్నించమనీ సలహా యిచ్చాడు. అనవసరంగా సమస్యల్ని కొనితెచ్చుకోవద్దని సూచించాడు.

ఇళ్లముందు గోడలకింద ముసలాళ్లూ, వాళ్లముందు దోగాడుతూ, తప్పటడుగులు వేస్తూ చంటి పిల్లలు. వీధి కూడళ్లలో అక్కడక్కడా ఆడు కొంటూ బడియీడు పిల్లలు.

"ప్రెసిడెంటు యిల్లెక్కడ పెద్దాయనా?" ఓ ముసలాయన్ను అడిగాడు.

నొసటికి చేయి అడ్డుంచి తదేకంగా చూశాడు ఆయన "యిట్నే... యీ యీధిన్నే పో నాయినా... కట్టకడానుంది... కల్లాలకాడ..." చెబుతూ అతనికేసి ఎగాదిగా చూసి "ఎవుర్నాయినా నువ్వు?" అడిగాడు.

"నేనా...?" ముసలాయనకేసి ఓసారి చూసి "మీ వూరి బడి టీచర్నులే..." చెబుతూ ముందుక్కదిలాడు.

ఆడుకొంటూ వున్న పిల్లల్లో కొందరు అటుకేసి చూశారు.

ఒక్కక్షణం ఆటలాపి మరీ పరిశీలనగా చూశారు. నేరుగా వీధి చివరిదాగా వెళ్లాడు రమణ. ప్రెసిడెంటు ఇంటిని సులభంగానే గుర్తుపట్టాడు.

వామిదొడ్లతో కూడిన కళ్లాల్ని ఆనుకొనే వుంది గట్టిమిద్దె. వాకిటి ముందు చెప్పులున్నాయి. బహుశా యింట్లోనే వున్నాడేమో! అతన్ని వెతుక్కొంటూ రావటం తనకే ఎబ్బెట్టుగా వుంది.

ఇంట్లోకి తొంగి చూశాడు. చీకటిగా వుంది.

ఒక్క నిమిషం తర్వాత లోపల్నించి ఓ పాప పరుగెత్తుకొంటూ బైటకొచ్చింది.

ఆరేళ్ల వయస్సుదాకా వుండొచ్చు. బడి యీడు పాపే.

"ప్రెసిడెంటుగారుండారా పాపా?" అడిగాడు.

మొహం చిట్లించింది పాప.

"నువ్వెవురూ?" అడిగింది.

"మీ సారున్లే..." పాప కళ్లల్లోకి చూస్తూ చెప్పాడు.

గిరుక్కున వెనక్కి తిరిగింది పాప.

పరుగెత్తుకొంటూ లోనికెళ్లింది. రెండు నిమిషాల తర్వాత మళ్లీ బైటికొచ్చింది.

"లేదని సెప్పమన్నెడు మా నాయన" అంది.

నొసలు ముడివడ్డాయి రమణకు. వెనుదిరిగాడు.

"బహుశా పాప తండ్రి ప్రెసిడెంటుకు తమ్ముడో, అన్నో అయ్యుంటాడు కాబోలు..." ఆలోచిస్తూ తలొంచుకొని వీధింట నడుస్తున్నాడు.

"కొత్త సారంట...పిల్లోల్లంతా నూడు యాడోల్లాడ దాపెట్టు కొన్నెరు...బడికి తీసపోతాడేమోనని..."

తన్ను గురించిన వ్యాఖ్యలు చెవుల బడటంతో తలెత్తి అటుఇటు చూశాడు. వీధి కూడళ్లలో ఆడుకొంటూ వున్న పిల్లలు నిజంగానే లేరు.

మొండిగోడల చాటున్నించి ఒకటి రెండు చింపిరి తలలు తొంగి చూస్తున్నాయి. తన చూపులు వాళ్ల కళ్లతో కలవగానే గబుక్కున చాటుకు ముడుచుకుపోతున్నాయి చిట్టెలుకల్లా.

గమ్మత్తుగా అన్పించింది అతనికి.

వాళ్లిట్లా భయపడుతున్నారంటే ముసలాళ్ల మాటల్లోని భావం ప్రకారం తను బహుశా పిల్లల్ని వెంటాడి యీడ్చుకు పోవాలన్నమాట. అట్లాంటి సంప్రదాయమేదో యిక్కడ వుండే వుంటుంది. లేకుంటే ఈ వాతావరణం ఎదురు కాదు.

వెంటాడి యీడ్చుకు రావటమో, మందలించి తోలుకుపోవటమో అతని కిష్టంగా లేదు.

ఊరు దాటుతోండగా గోడకింది ముసలాయన అడిగాడు "పెసిడెంటు వున్నెడా సారూ?" అంటూ.

"లేడంట పెద్దాయనా? ఆయప్ప తమ్ముడేమో వుండాడు"

"తమ్ముడా! వానికి తమ్ముల్లెవురూ లేరే?" ఆశ్చర్యంగా చూశాడు.

నొసలు ముడేసి ఆయనకేసి చూశాడు రమణ. "ఆరేళ్ల పాప వుంది నూడూ! ఆ పాప నాన్న..." చెప్పాడు.

కిసుక్కున నవ్వాడు ఆయన.

"వాడే పెసిడెంటు..." అన్నాడు.

ఇప్పుడు ఆశ్చర్యపోవటం రమణ వంతయింది. తను యింట్లో వుండి కూడా 'లేదని చెప్పమన్నాడంటే...

"ఎంత లావు అహంకారం ప్రెసిడెంటుకి!"

తల గిర్రున తిరిగిపోయింది అతనికి.

అవమానంతో దహించుకుపోతూ మెల్లిగా అడుగులేయసాగాడు.

బడి ముందునించి యాలపదాలు విన్పించినట్టయి తలెత్తి చూసేసరికి మేకల కాపరి కన్పించాడు. రాత్రి ఎంయీవో గారికి ఫోన్ చేసి విషయమంతా చెప్పాడు. తన మనోవేదనని ఆయనముందు విప్పాడు.

దాన్ని తేలిగ్గా తీసుకొని నవ్వాడు ఆయన.

రాజకీయ నాయకుల ప్రవృత్తే అలా వుంటుందనీ, ప్రభుత్వ ఉద్యోగులం తామే సర్దుకుపోవాలనీ, మరోసారి సర్పంచ్‌ని కలిసేందుకు ప్రయత్నించమనీ సలహాయిచ్చాడు. అనవసరంగా సమస్యల్ని కొనితెచ్చుకోవద్దని సూచించాడు.

చాలాసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు రమణ.

మళ్లీ రోజు ఎనిమిది గంటలకే బడివద్ద బస్ దిగాడు. బ్యాగ్‌ని బడిలో వుంచి నేరుగా పల్లె కేసి నడిచాడు. ఎంయీవో పాలనపట్ల మనస్సులో అసంతృప్తి రేగుతోన్నా, కళ్లు మాత్రం పచ్చని పొలాలపైకి రెక్కలు విప్పుకొని ఎగురుతున్నాయి.

ఊరిగమిల్లోంచి పొలాల మీదుగా దగ్గర్లోని పేటకు కాలిదారి వొకటుంది. దానిమీద ఒకరి వెనక వొకరుగా వెల్తూవున్న పిల్లలబారు అతని దృష్టిని కట్టిపడేసింది.

మూపున పుస్తకాల సంచి బరువుతో వొంగిపోయి నడుస్తూ రెండు కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకేసి కదులుతున్నారు వాళ్లు.

హఠాత్తుగా అతనికి నిన్న ఉదయం బడి ముందరి పిల్లల ఆట గుర్తొచ్చింది.

వీపులమీది పుస్తకాలు తమని మోస్తోన్న పిల్లల్ని అడుగుతోన్నట్లుంది "ఎంతెంత దూరం...?"అంటూ. క్రమక్రమంగా తనకు దూరమవుతోన్న



పిల్లల కేసి కొంతసేపు తదేకంగాచూసి తర్వాత తలతిప్పుకొని వూర్లోకి నడిచాడు రమణ.

"పెసిడెంటు కాడికేనా సారూ?" గోడకింది ముసలాయన అడిగాడు.

"ఆ...అక్కడికే పెద్దాయనా!"

"బో పని బన్నెట్టుందే..." చిన్నగా గొణుక్కున్నాడు.

అతని ప్రశ్నను పట్టించుకోకుండా ముందుకు కదిలాడు రమణ.

నిన్నటికి యివాల్టికి కొంత పరిచయం అన్పించింది వూరు. మొండి గోడలు, పూరి గుడిసెలు, అక్కడక్కడా పాత మట్టి మిద్దెలు, ఒకటో రెండో ఆర్సీసీ స్లాబులూ...

తనెవరో అర్థమైన జనం తమలో తాము పక్కవాళ్లకి పరిచయం చేయటం "రోజూ బడికొస్చాండంటమ్మే!"

"బాగనే బడిబెడ్తాండంట... మన పిల్లోల్లేమో యీాధ

లంబడి తిరుగుతాండ్రి..."

"మనం పంపకపోతిమి. వాళ్లకై వాళ్లు పోకపొయ్యిరి"

ఆడాళ్ల వ్యాఖ్యానాలు చెవుల బడుతున్నాయి.

గుడిముందరా, వీధి కూడళ్లలో ఆడుకొంటూ వున్న పిల్లల్లో చురుకైన కదలిక...తను వాళ్లని గమనించకముందే చెల్లాచెదరైన దృశ్యం.

ఎదలో ఏదో గిలిగింతలు రేపినట్లుగా అన్పించింది. అడుగులు ముందుకు పడేకొద్దీ అపురూపమైన హృదయ స్పందనలు కాస్తా కరగిపోతూ ప్రెసిడెంటు ఇల్లు ఎదురుపడింది.

అతన్ని కలవబోవటమే పెద్ద అపశృతిలా తోచింది రమణకు.

ఇంటివద్దే వున్నాడు ప్రెసిడెంటు. కూచోమని కూడా చెప్పలేదు.

**ఒక్కసారి వాళ్లు అతనికేసి వింతగా చూసి ముందుకు సాగారు. పిల్లలతో పిలిపించాడు. కేకలు వేసి మరీ పిల్చారు పిల్లలు. చేతులూ వుతూ పిల్చారు. వాళ్లు రావటం లేదు సరికదా వెనుదిరిగి వీళ్లనే తమ వెంటరమ్మని చేతులూ వుతూ పిల్చటం మొదలెట్టారు.**

"నీతో మాట్లాడాల్సుంది శానావుంది సారూ!" అన్నాడు నొసలు చిట్లించి చూస్తూ. "నువ్వు రాలేదను కొని సమస్యను ఎమ్మెల్యే దాకా తీసప్పోయినా. ఆయప్పను నిల్దీసి అడిగినా... అదెంతా నీతో గెట్టిగా సెప్పాలనే వుంది గాని... దానికి శానా టైం బడ్తది. నాకు రోంత అర్జెంటు పనిబడింది. ఇప్పుడు మాట్లాడను కాదు. రేపొక్కసారి వచ్చి కల్సిపో..." అంటూ మరో మాట గ్గూడా అవకాశం యివ్వకుండా చెప్పుల్లో కాళ్లు దూర్చి విసవిస వీధెంట నడచిపోయాడు.

ఆ సన్నివేశాన్ని భరించలేకపోయాడు రమణ. అతని తల నేలకు వాలిపోయింది.

ఇంత పచ్చి మొరటు మనిషి ముందు తలొంచే పరిస్థితిని కల్పించిన ఎంయీవోను తిట్టుకొన్నాడు. ఎంయీవోను వ్యతిరేకించలేని తన అసమర్థతను నిలువునా నిందించుకొన్నాడు. మెల్లిగా అక్కణ్నించి కదిలాడు.

ఎంయీవో అంతరంగమేమిటో అతనికి అంతుబట్టకుండా వుంది. తన డ్యూటీ తను సక్రమంగా నిర్వర్తిస్తున్నపుడు మరొకరి వొత్తిళ్లకు లొంగాల్సిన అవసరం ఏమిటో తెలీకుండావుంది. విద్యావిషయంగా రాజకీయ నాయకుల ప్రమేయాన్ని ఆయన కూడా సహించేవారు కాదని వినికిడి. తన విషయంలోనే ఎందుకో మరీ మరీ వొత్తిడి చేస్తున్నాడు.

"సారూ! యీ పిల్లోల్లందర్నీ కట్టగట్టుకొని తోలకపోరాదూ!" ఎవరిదో మాట విన్పించి అటుకేసి చూశాడు.

ఓ యాభైఏళ్ల స్త్రీ గోడల చాటునున్న పిల్లల్ని ఉద్దేశించి చెబుతోంది.

"పంపించండమ్మా!" అన్నాడు.

"రోయ్! పోదూరాండ్రా బడికి..." గద్దించినట్లుగా అంది ఆమె. ఆమె అరచిన దిక్కుకేసి చూశాడు. ఎవరూ కన్పించలేదు. గోడల చాటున ఆమెకు మాత్రమే కన్పించేటట్టుగా వొదిగి వున్నారన్నమాట. లోలోపల నవ్వుకొంటూ ముందుకు సాగాడు.

కొంత దూరం నడిచింతర్వాత ఎందుకో అనుమానం వచ్చింది.

"పంపిస్తానంది గదా! తను ఆగాలేమో!"

ఆగి వెనుదిరిగి చూశాడు.

ఆమె తనకేసి చూసింది.

"నువ్వు పో సారూ! మేం తోలకొస్చాంగానీ..." చెప్పింది.

ఊరు దాటుతోండగా గోడకింది ముసలాయన అన్నాడు "ఉన్నెడా సారూ పెసిడెంటు?" అని

"ఆ...వున్నాడు పెద్దాయనా!"

"పనయిందా?"

"రేపు రమ్మన్నాడు..."

"ముచ్చటగా ముగ్రోజులు తిరగాల్సుందేనంటనా? బో పొగురుబోతు బిడ్డలే" గొణుక్కొన్నాడు. నేరుగాబడికేసి అడుగులేయసాగాడు రమణ.

అతని మెదడంతా రకరకాల భావాలు కలగాపులగంగా అలుముకోసాగాయి.

ప్రెసిడెంటు ప్రవర్తన యీరోజు ప్రత్యక్షంగా బాధపెట్టినప్పటికీ, నిన్నటిలా మనస్సంతా అదే ఆక్రమించి యిబ్బందిపెట్టలేదు. తనపట్ల, పిల్లల పట్ల, వాళ్ల తల్లిదండ్రుల ప్రవర్తన ఏదో కొత్తదనపు అలల్ని మరో వైపునించి కదలిస్తూనేవుంది.

పొలాల్లోని కాలిదారి కళ్లబడేసరికి ప్రైవేటు స్కూలుకు వెళ్లే పిల్లలు గుర్తొచ్చారు. తమ పక్కనే బడి వుంచుకొని కూడా వాళ్లు చదువులకోసం వలస పక్షులవుతున్నారు. వీపులమీద బరువుల్తో "ఎంతెంత దూరం?" అంటూ దారిని లెక్కిస్తున్నారు.

ఎందుకని వాళ్లు వూరి బడికి దూరమవుతున్నట్లు? అతని ఆలోచనలు కొనసాగుతోండగానే రోజూ వచ్చే తన బడి పిల్లలు పైరగాలి తూనీగల్లాగా తన్నొరుసుకొంటూ పరుగులు తీశారు. తనకంటే ముందువెళ్లి తనకు నమస్కారాలు చెప్పాలని కాబోలు వాళ్ల ఆరాటం.

వినూత్నంగా అన్పించే వెచ్చని భావన ఏదో హృదయాన్ని స్పృశిస్తూ వెళ్లిన అనుభూతి కలిగింది అతనికి.

బడిలోకెళ్లి పిల్లలచేత ప్రార్థన చేయించి క్లాసులో సర్దుక్కూచోబోయేసరికి ప్రహరీ బైట శబ్దమైంది.

పిల్లల ఏడుపులూ...వాటివెనక పెద్దల గద్దింపులూ...

"నేను బడికిపోనే...సారు కొడ్తడే..." అంటూ గీ పెడుతోన్న పిల్లల్ని యీడ్చుకొంటూ, పిర్రల మీద దెబ్బలేస్తూ తెచ్చి బళ్లో కూలేశారు వాళ్లు.

"ఉచ్చబడేదాంక కొట్టు సారూ! ఇంటికి రానీగాకు..." వాళ్లను అక్కడ వదిలేసి వెళ్ళబోయాడు ఓ వ్యక్తి.

వెంటనే అతని కాలు కరచుకొని ఏడుపు పెద్దది చేశాడు కుర్రాడు.

ఏం చేయాలో తోచలేదు రమణకు. మూలనున్న బెత్తం చేతికి తీసికొన్నాడు. ఆ దృశ్యాన్ని చూసి ఒకరిద్దరు పిల్లలు కిక్కురుమనకుండా వెళ్లి కూచున్నారు. ఎగదన్నుకొచ్చే ఎక్కిళ్లను బలవంతంగా ఆపుకొనేందుకు ప్రయత్నిస్తూ.

మిగతా పిల్లలు మాత్రం గోలగోలగా ఏడుస్తున్నారు. పిల్లల తండ్రుల్లేకుంటే నాలుగుదెబ్బలు వేసి నోరు మూయించేవాడు. ఇప్పుడెట్లా యీ సమస్యను ఎదుర్కోవాలో అర్థం కాలేదు.

అంతలో గేటు తోసుకొని లోపలికి వస్తూ కన్పించాడు దోటి కొడవలి చేత బట్టుకొన్న మేకల కాపరి. ఏడ్చే పిల్లలకేసి, వాళ్లమీద కోపగించుకొనే తండ్రులకేసి నొసలు ముడేసి చూశాడు.

ఆ దృశ్యాన్నంతా ఉత్కంఠగా గమనిస్తూ ప్రేక్షకుడిలా నిల్చునివున్న రమణకేసి వింతగా చూశాడు.

"పిల్లోలట్టా బయపడ్తాంటే బుజ్జగించకుండా సూస్తాండవేంది సారో?" అంటూ పిల్లల దగ్గరికెళ్లి "యిదేం దెయ్యాలకొంప గాదు లేండ్రా

నాయాండ్లారా? అట్ట బయపడ్తాండ్రూ!" అంటూ వాళ్లని సముదాయించేందుకు ప్రయత్నించాడు.

వాళ్ల దగ్గరకెళ్లి గడ్డాలు పట్టి బతిమాలాడు.

చక్కిలిగిలి పెట్టి నవ్వించాలని చూశాడు.

ఆ వెనకే యాలపదం అందుకొన్నాడు చిన్నగా చేతులు కాళ్లు కదుపుతూ...

కీలగొంతుతో పాడటం, పిల్లల్ని నవ్వించేందుకు ప్రయత్నించటం

ఈ సందట్లో పిల్లల తండ్రులు మెల్లిగా అక్కణ్నించి జారుకొన్నారు.

పాటవెనక మరో పాట అందుకొన్నాడు మేకల కాపరి.

రమణకు ఆశ్చర్యంతో ఒళ్లంతా జలదరించింది.

తను, పిల్లల కన్నవాళ్లూ కలసి చేయలేని పనిని ఆ మేకల కాపరి చేయగలిగాడు. కొంత సేపయింతర్వాత పాడుకొంటూనే బైటకెళ్లాడు కాపరి.

ఆ పైన తరగతిగదిని తన అదుపులోకి తీసుకోవటం రమణకు చాలా సులభమైంది. మేకల కాపరి ఆట పాట అతనికి మాటిమాటికి గుర్తొస్తున్నాయి.

మధ్యాహ్నం కొందరు గ్రామస్తులు బడిలో కొచ్చారు. అతని భోజనానంతరపు తీరిక సమయాన్ని వాళ్ల స్వాధీనం చేసికొన్నారు. బాండ్లు చూపించి, వడ్డీలు లెఖ్ఖ గట్టించుకొన్నారు. తమకు తెలీని విషయాల్ని చర్చించుకొన్నారు.

వాళ్ల తన తీరిక సమయాన్ని ఖర్చు చేయటంపట్ల రమణకు ఇష్టం లేకున్నా, తనపట్ల వాళ్లు ప్రదర్శించిన సాన్నిహిత్యం కొత్త అనుభూతిని కలిగిస్తూ మొదటి భావాన్ని దూరంగా పారదోలింది.

సాయంత్రం బసెక్కిన తర్వాత కూడా బడిలో మేకల కాపరి పాడిన పాట, ఆడిన ఆటే గుర్తుకొస్తున్నాయి.

రాత్రి పడుకొని కళ్లు మూసుకొంటే కలల్నిండా అవే దృశ్యాలు.

మరో రెండ్రోజుల పాటు ప్రెసిడెంటును కలిసేందుకు వీల్లేకుండా పోయింది. గుణాత్మక విద్య ప్రోగ్రాంకు సంబంధించిన అబ్జర్వర్ రావటాన్ని గురించి రికార్డులు సరిచూసుకోవటంతోనే గడిచిపోయింది.

మధ్యమధ్యన పిల్లల తల్లిదండ్రుల సందర్శన ఎక్కువైంది. ఈ రెండ్రోజుల్లో వాళ్లతోటి సాన్నిహిత్యం బాగా మెరుగుపడింది.

మూడోరోజు ఉదయం ఎనిమిది గంటల బస్సుకు నేరుగా గ్రామంలోనే దిగాడు. చేతిలో క్యారియర్ సంచి వేలాడుతోండగా ప్రెసిడెంటు ఇంటికేసి కదిలాడు.

"అతని పీడయీ రోజుతో వొదిలించుకోవాలి"

వీధి మొగదలే ముసలాయన పరామర్శించాడు "పెసిడెంటుకాడికేనా సారూ!" అని.

"అక్కడికే పెద్దాయనా!" చెప్పాడు.

"బంగపడే కొద్దీ వాడు నీలుక్కుంటాడు సారూ! సారికి సారికి వాని కాడికేంది పొయ్యేది బొచ్చా! నువ్వు బడికి పో సారూ! పనుంటే వాడే నీకాడికొస్చాడుగానీ.." చెప్పాడు.

సమాధానమివ్వకుండా ముందుక్కదిలాడు రమణ.

వీధుల్లో ఆడుకొంటూ వున్న పిల్లలు తన్ను చూడగానే ఇళ్లల్లోకి పారిపోతున్నారు.

"సారును సూస్చానే అంత బయపడ్తే ఎట్టా? యీ బయ్యం యీధల్లేకి పోకముందే వుండాల" కుమారుడి భయాన్ని చూసి నవ్వుకొంటూ అంది తల్లి.

"నువ్వు నెత్తి దువ్వేతే గాదూ బడికి పొయ్యేది" తప్పును తల్లిపైకి నెడుతున్నాడు వాడు.

ఆ మాటలు చెవుల సోకి ఏవో గిలిగింతలు రేపినట్లుగా వుంది రమణకు.

వింటూ ముందుకు సాగుతోంటే కొంతమంది పిల్లలు బడికి ప్రయాణమై ఎదురొచ్చారు.

దూరాన్నించే ప్రెసిడెంటు ఇంటిని గమనించాడు. పంచలోనే వున్నాడు ప్రెసిడెంటు.

ఒకే కుర్చీ వుంది.

అందులో అతను కూచుని తనకేసే చూస్తున్నాడు.

తన్ను గురించే ఎదురుచూస్తోన్నట్లుంది.

అతని వద్దకెళ్లి తను చేతులు కట్టుకొని నిలబడి సమాధానాలివ్వాలని కాబోలు ఆ వాతావరణమంతా.

ఒక్క చూపులోనే దృశ్యాన్నంతా అర్థం చేసికొన్నాడు రమణ.

తర్వాత అటుకేసి కళ్లెత్తి కూడా చూడలేదు.

ఇళ్లల్లో తయారవుతోన్న పిల్లల్ని కూడా దగ్గరకు పిల్చుకొని ఒకరొకర్నే కూడేసుకొన్నాడు. వాళ్లంతా తన చిట్టి సైన్యంలా స్ఫురించి ఏదో బలం గుండెల్నిండా ప్రవహించింది.

పిల్లల్ని వెంటేసుకొని వెనక్కి తిరిగాడు.

తన వద్దకొచ్చి సంజాయిషీ యిచ్చి లొంగిపోతాడనుకొన్న టీచర్ హఠాత్తుగా తన్ను గుర్తించకుండానే వెనుదిరిగి పోవటాన్ని వింతగా చూశాడు ప్రెసిడెంటు. నొసలు ముడేసి, నమ్మలేనట్లుగా చూశాడు.

రమణకు రక్తనాళాల్నిండా కొత్త శక్తి వచ్చిచేరినట్లుగా అన్పించింది. అతని చుట్టూ పిల్లల సమూహం. పిల్లల వొళ్లంతా తడువుతూ వాళ్ల వెనక వాళ్ల కన్నవాళ్ల చూపులు.

పిల్లల్ని వెంటేసుకొని బడికేసి కదలిపోతూ వున్నాడు రమణ.

ఊరిబైట కాలిదారివెంట ప్రైవేటు పాఠశాలకు వెళ్తోన్న పిల్లల్ని చూడగానే అతనికి 'ఎంతెంత దూరం?' ఆట గుర్తొచ్చింది.

ఊరి బడికివాళ్లకు దూరం పెరిగి పోతోంది.

అంటే తనకు వాళ్లకు దూరం పెరిగిందన్నమాట. ఈ భావన వింతగా అన్పించింది అతనికి.

తను వాళ్లను ఎప్పుడూ దూరం చేసుకోవాలనుకోలేదు. అలాగని దగ్గర చేసుకోవాలని కూడా ప్రయత్నించ లేదు.



ప్రతిరోజూ తను క్యారియర్ మోసుకొంటూ బడివద్ద దిగటం, మళ్లీ అక్కడే బస్సు ఎక్కటం లో తను కోల్పోయే దేమిటో...అర్థమైంది. తను బసెక్కి ప్రయాణించటం కాదు గాని, బస్సే తన వీపెక్కి 'ఎంతెంత దూరం?' అని అడుగుతున్నట్లుగా అన్పించింది. తను చెరిపి వేయాల్సిన దూరాలు చాలా వున్నాయి.

బడిలోకి వచ్చిన వాళ్లకే పాఠాలు చెబుదామనుకొన్నాడు గాని, గ్రామంలోని పిల్లలంతా వుండవలసింది తన బడిలోనే అనే భావన ఎప్పుడూ అనుభూతించలేదు. వాస్తవానికి తాము పిల్లల ప్రపంచానికి సంబంధించిన వాళ్లం. వూరి పిల్లలందర్నీ తాము ఆకర్షించాలి. బడిబైట కొందరు, ఇతర బళ్లకు కొందరు వెళ్తున్నారంటే వృత్తిరీత్యా తాము విఫలమైనట్లే.

ఆ భావన మనస్సులో కలగగానే రమణ హృదయం ఏదో తెలీని వేదనకు గురయ్యింది.

దూరంగా వెళ్తోన్న పిల్లల్ని పిల్చాడు "రాండి...రాండి...మా బడికి రాండి..." అంటూ.

ఒక్కసారి వాళ్లు అతనికేసి వింతగా చూసి ముందుకు సాగారు. పిల్లలతో పిలిపించాడు. కేకలు వేసి మరీ పిల్చారు పిల్లలు. చేతులూపుతూ పిల్చారు. వాళ్లు రావటం లేదు సరికదా వెనుదిరిగి వీళ్లనే తమ వెంటరమ్మని చేతులూపుతూ పిల్చటం మొదలెట్టారు.

మొన్న బడిలో పిల్లల ఏడుపులు, వాళ్లను సముదాయించేందుకు మేకల కాపరి పాడిన పాట, ఆడిన ఆట గుర్తొచ్చాయి రమణకు.

తన వద్ద ఏదో లోపించింది.

పిల్లల్ని ఆకర్షించి, ఆనందపరిచే లక్షణమేదో లోపించింది.

తనింతవరకు పాఠశాల అంటే కేవలం పాఠాలు చెప్పే తావుగానే భావిస్తూ వున్నాడు. కాదు భ్రమపడుతూ వున్నాడు.

పాఠశాల పాటలు పాడేది, ఆటలు ఆడేది కూడా.

"పాటశాల+ఆటశాల=పాఠశాల" అతనికి హఠాత్తుగా గుర్తొచ్చింది మొన్న మీటింగ్‌లో ఎమ్మార్పీ చెప్పిన యీ సమీకరణం.

ప్రతిరోజూ తను క్యారియర్ మోసుకొంటూ బడివద్ద దిగటం, మళ్లీ అక్కడే బస్సు ఎక్కటం లో తను కోల్పోయేదేమిటో...అర్థమైంది.

తను బసెక్కి ప్రయాణించటం కాదు గాని, బస్సే తన వీపెక్కి 'ఎంతెంత దూరం?' అని అడుగుతున్నట్లుగా అన్పించింది. తను చెరిపి వేయాల్సిన దూరాలు చాలా వున్నాయి.

తనిన్ని రోజులూ బడి అంటే కేవలం నాలుగు గోడల గది అనుకొన్నాడు. తన ఆలోచనలకు, వాస్తవాలకు ఎం తెంత దూరం!

హఠాత్తుగా అతనికి తన చేతిలోని క్యారియర్ సంచి బరువుగా అన్పిం చింది.

తన్ను 'ఎంతెంత దూరం?' అం టూ ప్రశ్నించే మొట్టమొదటి గొంతుక అదే నని పించింది. ముందు దీన్ని వదల్చుకో వాలి. గ్రామస్తుల్లో ఒకడిగా జీవించాలి.

ఈ భావనలన్నీ కలగలిపి అతని శరీరమంతా ఏదో ఉత్సాహాన్ని నింపాయి. అతని నోటి నుంచి అప్రయత్నంగానే ఓ పాట మొదలైంది.

ఆ పాట అతని చుట్టూ వున్న పిల్లల్ని ఆప్యాయంగా తడువుతూ ప్రైవేటు పాఠశాలకు వెళ్లే పిల్లలకేసి సాగింది.

కదలిపోతూ వున్న 'పాట, ఆట' కేసి ●